క్లుప్తంగా

పనితీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పనితీరు మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రమణ్యం హెచ్చరించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. భూసమస్యల పరిష్కరంలో అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబు నాయుడు, మండల సర్వేయర్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులు నశించి, చిన్నపిల్లల్లో రక్తహీనత దూరమవుతుందని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుతో కలసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని తెలిపారు. సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



మాట్లాడుతున్న ఎంఈఓ

నాగలాపురం: మండల కేంద్రంలోని హైస్కూల్ ప్లస్‌లో శుక్రవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎ.వెంకటేశ్వర్లకు ఎంఈఓ బాబయ్య, జనార్దనరాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మనిషి జీవితంలో గురువుకు ఉన్నత స్థానం ఇస్తామన్నారు. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చి దిద్దడంలో గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. అనంతరం ఉత్తమ అవార్డు పొందిన వెంకటేశ్వరులకు శాలువ కప్పి, సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, కారణి హెచ్‌ఎం అరుణకుమారి, ఎంపీటీసీ సభ్యులు రాజ, నాయకులు శ్రీనివాస యాదవ్, పార్థిబన్, వెంకటేష్, ఉపాధ్యాయులు తంగరాజ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి సేవ'తో క్లీన్ సత్యవేడు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛతాహి సేవా–2024 క్యాంపైన్ కార్యక్రమాలతో సత్యవేడు మండలం పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు 'స్వచ్ఛతా హై సేవా' కార్యక్రమాల్లో 'స్వభావ్ స్వచ్ఛతా–సంస్కార్ స్వచ్ఛత'లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. తద్వారా చెత్త కుప్పలు లేని పరిశుద్ధమైన గ్రామాలను తీర్చిదిద్దాలన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులకు వ్యాచరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి, వారికి వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. బంక్లపైన, హోటళ్లలో ఆహారాన్ని విక్రయించే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. శ్రమదానం కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిరవికుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుపరం చేయవద్దు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమైతే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్‌మెంట్ కోటాలో చేరుతాయి. దీంతో పేదలు, మెరిట్ విద్యార్థులకు వైద్యవిద్య భారంగా మారుతుంది. ప్రైవేటీకరణ చేస్తే ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వ కాలేజీలు అయితే పెద్దగా ఉంటాయి. రోగులు ఎక్కువ మంది వస్తారు. విద్యను బాగా చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రైవేటులో దీనికి భిన్నంగా పరిస్థితులు ఉంటాయి. ప్రైవేటు వారు ఇష్టమెచ్చినట్లు వ్యవహరిస్తారు. మేనేజ్‌మెంట్ కోటాలో వారు ఎంత చెబితే అంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పేదలకు వైద్య విద్య దూరమవుతుంది. –భాస్కర్ రెడ్డి, విద్యార్థి తండ్రి, వరదయ్యపాళెం మండలం



ప్రైవేటీకరణ విరమించుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ఈ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను విరమించుకోవాలి. ఇన్నాళ్లూ వైద్యవిద్య వ్యాపారంగా మారి మెడికల్ సీటు రూ.కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పిల్లలకు వైద్యవిద్య అందాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కళాశాలలతో ఎంతో ఉపయోగం చేకూరింది. అయితే ప్రస్తుత సర్కారు వాటిని ప్రైవేటుపరం చేయాలని ఆలోచిస్తోంది. ఇది సరికాదు. ప్రభుత్వ పెద్దలు పునరాలోచించి మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ఆలోచన విరమించుకుని, పేదలకు న్యాయం చేయాలి. శంకర్‌రెడ్డి, విద్యార్థి తండ్రి, గురవరాజుపల్లి, రేణిగుంట మండలం

అక్రమాలు అచ్చెరువు

చెరువు పదుర్లకు ఆదరువు.. చెరువే మనుగడకు ఆధారం.. తొలకరికి ఆవాసం.. సిరులకు ప్రాకారం.. చెరువే సమస్తం.. మన నేస్తం.. అలాంటి వనరుకు రక్షణ లేకుండా పోతోంది. ఆక్రమణలకు అడ్డాగా మారుతోంది.. వెరసి అందని సాగునీరు.. పొలాలన్నీ బీళ్లు.. వెరసి అన్నదాతలకు తప్పని తిప్పలు. ఈ అక్రమాలు చూసిన ఎవరైనా అచ్చెరువు చెందాల్సిందే.

- చెరలో చెరువులు
- సాగునీరు అందక అన్నదాతలకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



ఆక్రమణకు గురైన ఏర్పేడు చెరువు

ఏర్పేడు: పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ఆధారమైన చెరువులు పలు చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. చెరువు భూముల ఆక్రమణపై పలువురు రైతులు ఏళ్ల తరబడి మండల స్థాయి, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. పంటలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 40 పంచాయతీలు, 77 ఇరిగేషన్ చెరువులు, 103 ఊటగుంటలు ఉన్నాయి.



చెరువు ఆక్రమణను తొలగించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మడిబాక రైతులు(ఫైల్)

80శాతం పైగా కబ్జా

రావిళ్లవారికండ్రిగ పంచాయతీ పరిధిలోని రెడ్డిగుంట, ముసలిపేడు, గుండ్లకండ్రిగ తదితర చెరువులు 80 శాతంపైగా ఆక్రమణకు గురయ్యాయి. అంజిమేడు, సీతారాంపేట, ఇసుకతాగేలి చెరువులను తిరుపతికి చెందిన రియల్టర్లు ఆక్రమంచి ఏకంగా ప్రహరీగోడ నిర్మించారు. గత నెలలో మడిబాక చెరువు ఆక్రమణకు గురైందని స్థానిక రైతులు తహసీల్దార్ భార్గవికి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏర్పేడు, కోబాక, పాతవీరాపురం, మాధవమాల, మత్రిగుంట, పాగాలి, పంగూరు, చిందేపల్లి, మేర్లపాక, మన్నసముద్రం, బండారుపల్లి, ఎండీ పుత్తూరు, గుడిమల్లం, కందాడు, రాజులపాళెం, నచ్చనేరి, వికృతమాల తదితర చెరువుల్లో వంద ఎకరాలకు పైగా ఆక్రమణకు గురయ్యాయి.

చిట్టేటి గుంట మాయం



చిట్టేటిగుంతలో అక్రమంగా నిర్మించిన పక్కాభవనం(ఫైల్)

మండలంలోని పెనుమల్లం రెవెన్యూలో సర్వేనంబర్ 181–4లో 4.84 ఎకరాల్లో చిట్టేటిగుంట ఉంది. పూర్వీకుల నుంచి గ్రామస్తులు గుంటలోని నీటిని తాగునీరుగా ఉపయోగించుకునేవారు. అలాగే పశువులు, మేకలు, గొర్రెలు తాగుతుండేవి. టీడీపీ నాయకులు పలువురు చిట్టేటిగుంటలో సుమారు 2.5 ఎకరాలను అక్రమించి ఏకంగా పక్కాగృహాలు నిర్మించుకున్నారు.

పట్టించుకునే వారు కరువు



చెరువులు, గుంటలు విచ్చలవిడిగా ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. పంచాయతీ పరిధిలోని చిట్టేటిగుంట ఆక్రమణకు గురైంది. ఏళ్ల తరబడి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుంది. విచారణ చేపట్టి కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.
–రమేష్, రైతు, పెనుమల్లం, ఏర్పేడు మండలం

ఏటా సాగునీటికి ఇబ్బందులు



చాలాకాలంగా చెరువులు ఆక్రమించి వ్యవసాయ భూములుగా మార్చి సాగు చేసుకుంటున్నారు. దీంతో చెరువుల్లో సమృద్ధిగా సాగునీరు చేరడంలేదు. దీంతో పంటలకు ఏటా సాగునీరు అందడం లేదు. ఫలితంగా పంటలు పండక, పొలాలు బీళ్లు పోయి, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
–చెంచురెడ్డి, చిందేపల్లి, ఏర్పేడు మండలం

త్వరలో కమిటీ ఏర్పాటు



ప్రస్తుతం రెవెన్యూ అధికారుల ద్వారా చెరువుల ఆక్రమణలు గుర్తిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతాం. చెరువుల్లో ఆక్రమణల తొలగింపు, నీటి వనరుల పరిరక్షణకు త్వరలో జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.
– భార్గవి, తహసీల్దార్, ఏర్పేడు మండలం

నష్ట పరిహారం చెల్లించాకే పనులు చేసుకోండి

- అపాచీ పరిశ్రమ పనులను అడ్డుకున్న రైతులు



అపాచీ పనులను అడ్డుకుంటున్న రైతులు

శ్రీకాళహస్తి రూరల్: వ్యవసాయ భూములను కోల్పోయిన తమకు రావాల్సిన నష్ట పరిహారం చెల్లించాకే పరిశ్రమ పనులు చేపట్టాలని బాధిత రైతులు శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజుపల్లి సమీపంలో ఏర్పాటు చేస్తున్న అపాచీ పరిశ్రమ పనులను అడ్డుకున్నారు. వాంపల్లి, జగ్గరాజు పల్లి, గోవిందరాజుపల్లెకు చెందిన 22 మంది రైతుల 30 ఎకరాల భూమికి నష్టపరిహారం చెల్లించలేదు. దీంతో ఇంతకాలం అపాచి పరిశ్రమ పనులు ప్రారంభం కాలేదు. అయితే గుట్టుచప్పుడు కాకుండా పరిశ్రమ యాజమాన్యం శుక్రవారం తమ భూముల్లో పనులను చేపడుతున్నట్లు సమాచారం తెలియడంతో రైతులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. తమకు నష్టపరిహారం చెల్లించే వరకు పనులు చేపట్టవద్దని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో చర్చించారు. ఏదైనా సమస్య ఉంటే కార్యాలయానికి వచ్చి తెలపాలని సూచించి పనులను కొనసాగించారు. కాగా రైతులందరికీ నష్టపరిహారం చెల్లించామని, ఎనిమిది మంది రైతులు కోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో వారికి మాత్రం పెండింగ్ ఉందని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

సత్యవేడు: మండలంలోని చెరివి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఏఈ జగదీష్ తెలిపారు. మండలంలో రాజగోపాలపురం, పీవీపురం, చమర్తి కండ్రిగ, ఓబులరాజుకండ్రిగ, రేపల్లెవాడ గ్రామాల్లోని విద్యుత్ ఉండదన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలవరకు విద్యుత్ ఉండదని ట్రాన్స్‌కో ఏడీ చంద్రనాయక్, ఏఈ జైసాయి తెలిపారు. అలాగే పిచ్చాటూరు మండల కేంద్రంలో కూడా ఈ వేళల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని వారు తెలిపారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టిందుకు యువత ముందుకురావాలని సీఐ తిమ్మయ్య పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా అనే అంశంపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని, మత్తు పదార్థాలను వాడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత మత్తుకు బానిసైతే జీవితాలతోపాటు కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఐ విశ్వనాథనాయుడు మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు సెల్‌ఫోన్ల్, టీవీలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లోని గేమ్స్‌కు అలవాటు పడితే చదువు రాదని, దీంతో జీవితం నాశనం అవుతుందన్నారు. చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం వస్తుందని, పేదరికం దూరం అవుతుందని తెలిపారు. చేడు స్నేహాలు, చేడు అలవాట్లకు బానిసలు కావద్దని, విద్యార్థి దశలో చాలా జాగ్రత్తగా వ్యవహరించి, మంచి వ్యక్తిత్వాన్ని అలవచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు మాయమాటలు నమ్మి మోసపోకూడదని, సమస్యలుంటే తనకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



జిల్లా కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న విద్యార్థులు

రేణిగుంట: పట్టణానికి చెందిన డాక్టర్ బషీర్ తపస్య పాఠశాల విద్యార్థులు మానవతా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, విజయవాడలోని వరద బాధితులకు సహాయంగా రూ.30 వేలు విరాళాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.విక్రమ్ షాలీ, డైరెక్టర్ కే.అనూష, ఏఓ వి.పి.మాధవి, ఉపేంద్ర విద్యార్థులతో కలసి తిరుపతిలోని కలెక్టర్‌కు కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌కు చెక్కును అందజేశారు. కలెక్టర్ విద్యార్థుల సేవా స్ఫూర్తిని ప్రశంసించారు.

కాణిపాకం వరసిద్ధునికి ముక్కంటి సారె



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకెళ్లి, వినాయక స్వామివారికి సమర్పించారు. ఆలయం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి మేళతాళాల నడుమ పట్టు వస్త్రాలు తీసుకెళ్లారు. వారికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళి స్వాగతం పలికారు. వేదపండితులు వాటిని స్వీకరించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

మేమంతా గురుభక్తితో చదువుకున్నాం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవీ ప్రభాకర్‌రెడ్డి

ఏర్పేడు: తామంతా గురుభక్తితో చదువుకున్నామని, మీరూ అదే మార్గంలో పయనిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రిన్సిపల్ జీవీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ, దేశభక్తితో మెలగాలని సూచించారు. ఈ ఏడాది ఇంటర్మీడియేట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, మదనపల్లె మెరిటాస్ అధినేత విజయశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ శశికళ, అధ్యాపకులు వెంకటసుబ్బమ్మ, శ్రీమన్నారాయణ, సువర్ణ, శంకరప్ప, ఉమా, అమరేశ్వర్‌రెడ్డి, షమీర్, సోమశేఖర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం

శ్రీకాళహస్తి: పానగల్‌లోని రాస్ కార్యాలయంలో రాస్–జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు అవసరమన్నారు. ఈ ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, హరిబాబు, వెంకటేష్, సుబ్బారావు, వినోద్, ముఖేష్, మీనా, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఏర్పేడు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మేర్లపాక వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, డిక్షన్ కంపెనీ వద్ద ఒక ట్రాక్టర్, ఫాక్స్‌లింక్ కంపెనీ వద్ద ఒక ట్రాక్టర్ సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సీతారాం ఏచూరికి అశ్రునివాళి





శ్రీకాళహస్తి: సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, ఏర్పేడులో..

శ్రీకాళహస్తి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్‌ఏచూరికి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సీపీఎం నేతలు శుక్రవారం నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, కుమార్, అన్వర్‌బాషా, ఉస్మాన్‌బాషా, రాజా, వెలివేంద్రం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం నివాళులర్పించా. ఆమందూరులో రైతు సంఘం, ఏర్పేడులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కలపాటి గురవమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, జిల్లా నాయకుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అమరావతి

శ్రీకాళహస్తి: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పలువురు ఉపాధ్యాయులను పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సరస్వతీబాయి పాఠశాల ఆవరణలోని పిళ్లారి కళావేదికలో సంస్థ అధ్యక్షురాలు అమరావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు దశ, దిశకు అసలైన మార్గదర్శకులన్నారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌తో పాటు మరో 13మందిని సన్మానించారు. ఎంఈఓ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బండారుపల్లి విద్యార్థిని ప్రతిభ

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు హైస్కూల్‌లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బండారుపల్లి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి కృష్ణవేణి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గుంతలు.. ప్రమాదాలకు నిలయాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కేటీ రోడ్డుకు ఓ వైపున వేస్తున్న గ్యాస్ పైపులైన్ కోసం తీసిన గుంతల ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. తడ–శ్రీకాళహస్తి రోడ్డుపై ప్రతిరోజు వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మలుపుల వద్ద గ్యాస్ పైపు లైన్ గుంతలతోపాటు మట్టి కుప్పలుగా పోయడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే గ్యాస్‌పైపు లైన్ వేసిన వెంటనే గుంతలను పూడ్చాలని, రోడ్డులపై ఉన్న మట్టిని తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.





కంచనపుత్తూరు వద్ద మలుపు గ్యాస్‌పైపు లైన్ కోసం తీసిన గుంత, తానిగిల్లు మలుపు వద్ద ఉన్న గుంత

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

నాగలాపురం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని సుబ్బనాయుడుకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త కల్పన, మనెమ్మ, జ్యోతి పాల్గొన్నారు.





నాగలాపురం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతి, బుచ్చినాయుడుకండ్రిగ: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందజేస్తున్న పౌషికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌషికాహార మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. పౌషికాహారంతో రక్తహీనత దూరమవుతుందన్నారు. పౌషికాహారాన్ని వృథా చేయకుండా తప్పనిసరిగా తినాలని తెలిపారు. అలాగే పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పని సరిగా బిడ్డలకు పాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, అంగన్‌వాడీ సిబ్బంది ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.